'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# కేసీఆర్ రాక అనివార్యం

వనం జ్వాలా నరసింహారావు

**తెలంగాణ ఒక కల, ఒక లక్ష్యం, ఒక పోరాటం! ఆ పోరాటంలో గెలిచింది ప్రజలు. వారికి నాయకత్వం వహించింది కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. ఇది చరిత్ర. పోరాటం ద్వారా సిద్ధించిన తెలంగాణ పురోగమనం, అభివృద్ధి, స్వాభిమానం అనే విలువలతో ముందుకెళ్లిన వేళ, దాన్ని వెనక్కు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఆ చర్యలను అడ్డుకోవాల్సిన ఆవశ్యకత మరింత పెరిగింది.**

తెలంగాణ అభివృద్ధికి అవిరళ కృషి చేసిన నాయకుడు తిరిగి అదే దారిలో ప్రజలకు మార్గదర్శకత్వం అందించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రస్తుత తరుణంలో తెలంగాణకు అవసరమైన నాయకత్వం ఎవరు అందించగలరన్న ప్రశ్నకు సమాధానం దొరికింది. ఫిబ్రవరి 19న హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. తెలంగాణ సమాజం చారిత్రక అవసరం దృష్ట్యా ప్రసవించిన బిడ్డ నాటి తెలంగాణ రాష్ట్ర సమితి (నేటి బీఆర్ఎస్)ని నెలలు నిండకుండానే నలిపివేయాలని ఎన్నో కుట్రలు జరిగాయని, అయినా వాటన్నింటినీ అధిగమించి రాష్ట్రాన్ని సాధించామని ఆ సమావేశంలో కేసీఆర్ గుర్తుచేసుకున్నారు.

తెలంగాణ ఇప్పుడు మళ్లీ వలసవాద కుట్రలకు బలయ్యే ప్రమాదం ఉన్నది. గత అనుభవాల గాయాల నుంచి కోలుకుంటున్న తరుణంలో వలసవాద పాలకుల చేతిలో పడితే ఇబ్బందుల పాలవుతాం. అలా జరగకుండా ఉండాలంటే, తెలంగాణకు శాశ్వతంగా న్యాయం జరగాలంటే ప్రజలను పూర్తిస్థాయిలో చైతన్యపరచాలి. తెలంగాణకు రక్షణ కవచం బీఆర్ఎస్ మాత్రమే. సమావేశం విశిష్టత గురించి కూడా కేసీఆర్ వివరించారు. తెలంగాణ జాతి ప్రస్థానంలో తలెత్తిన గాయాల బాధలు పూర్తిగా మానిపోయి, స్వేచ్ఛా వాయువులు పీల్చుకొనేలా, తెలంగాణ తనకు తాను నిలబడాలన్న ఆశయంతో పుట్టిందే మన పార్టీ అని, అటువంటి చారిత్రక పాత్రను పోషించేందుకు సిల్వర్ జూబ్లీ వేడుకలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందుకు లోతైన చర్చ కోసం నిర్వహిస్తున్నదే ఈ ప్రత్యేక సమావేశమని చెప్పారు. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా పటిష్ఠ నిర్మాణం చేసి అటు పార్టీ విజయం కోసం, ఇటు తెలంగాణ ప్రజల శాశ్వత విజయం కోసం సమాంతరంగా పనిచేయాలని సమావేశంలో పాల్గొన్న నాయకులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశానికి సరిగ్గా రెండు రోజుల ముందు ఫిబ్రవరి 17న కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్లిన స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్ అంజనేయ గౌడ్ అక్కడ కనిపించిన దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు. వేలమంది అభిమానులు, అనుచరులు, వివిధ రంగాల ప్రజలు కేసీఆర్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చారని, వారి రాక ఓ అద్భుతమైన సంకేతంగా మారిందని, కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం అనివార్యం, అత్యంత ఆవశ్యమని అర్థమైందని రాశారు.

బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కేసీఆర్ 25 ఏండ్లకు పైగా తెలంగాణ సమకాలీన రాజకీయాలను శాసించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రాన్ని పునర్నిర్మించారు. ఆయన అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సామాన్యులకు ఎంతో మేలు చేకూర్చాయి. అయినప్పటికీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆయన పునరాగమనానికి ఏవిధమైన ఆటంకాలు లేవనే విషయం త్వరితగతిన మారుతున్న రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. 'రైతుబంధు', 'దళితబంధు', 'మిషన్ భగీరథ', 'మిషన్ కాకతీయ', కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణను ఆత్మనిర్భర రాష్ట్రంగా తీర్చిదిద్దారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో పథకాన్ని రద్దు చేస్తూ రాష్ట్రాన్ని తిరిగి సంక్షోభం దిశగా నడిపిస్తున్నది. ఈ పరిస్థితుల్లో కేసీఆర్ పునరాగమనం మినహా రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, భవిష్యత్తుకు బలమైన భరోసా మరోటి లేదు.

**చరిత్ర పునరావృతమవుతుంది. తప్పును సరిదిద్దుకోవడం తప్పదనే విషయం ప్రజలకు అనుభవమే. ఇలాంటి సందర్భాలు 'భారతదేశ రాజకీయ చరిత్ర'లో అనేకం ఉన్నాయి. పాలనా వైఫల్యానికి ప్రతిస్పందనగా ప్రజలు పునరాగమనానికి తలొగ్గారు. ఘోర ఓటమి తర్వాత ఇందిరా గాంధీ ప్రజా మద్దతుతో మళ్లీ గెలిచారు. సమాజాలను మార్చిన నాయకులు చరిత్రలో కనుమరుగు కారు. వారు మరింత బలంగా తిరిగి వస్తారు.**

తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు చౌరస్తాలో ఉన్నది. స్థిరమైన, సంక్షేమాధారిత పాలన ప్రయోజనాలను అనుభవించిన ప్రజలు చేసిన తప్పును సరిదిద్దుకునే దశలో ఉన్నారు. నాయకత్వం అంటే పాలన మాత్రమే కాదు, అది రాష్ట్ర భవిష్యత్తును మలిచే అంశం. ఇది రాజకీయంగా మాత్రమే కాదు, తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి కోసం కేసీఆర్ తిరిగి రావడం అవసరం, అనివార్యం.

బీఆర్ఎస్‌కు తిరిగి పుంజుకొనే శక్తి ఉన్నది. కేసీఆర్ పుట్టిన రోజు ఆయన వ్యవసాయ క్షేత్రానికి వచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ మద్దతుదారులు సంస్థాగత శక్తికి ఒక ఉదాహరణ. కేసీఆర్ దూరదృష్టి, రాజకీయ మేధస్సు, బీఆర్ఎస్ పునరాగమనాన్ని సుసాధ్యం చేయడమే కాకుండా సమీప భవిష్యత్తులో రాజకీయ పునరేకీకరణకు, సమీకరణకు మార్గనిర్దేశనం చేయవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమవడం వల్ల రైతులు, నిరుద్యోగ యువత, సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో పెరుగుతున్న అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ అసంతృప్తిని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా క్రోడీకరించి, ప్రజలకు వారు కోరుకున్న రీతిలో బలమైన ప్రత్యామ్నాయాన్ని అందించగలమన్న భరోసా కల్పించగలిగితే కేసీఆర్ తిరిగి కచ్చితంగా సీఎం అవుతారు. మారుతున్న రాజకీయ పరిస్థితులను అనుసరించి బీఆర్ఎస్ తన విధానంలో మార్పు చేర్పులు చేసుకోవాలి. తెలంగాణ చరిత్రాత్మకమైన మలుపులో నిలిచివున్న ఈ సమయంలో అనుభవం, దూరదృష్టి, సంక్షేమ ప్రధానమైన కేసీఆర్ నాయకత్వం అత్యంత అవసరం. కేసీఆర్ కేవలం ప్రాంతీయ నాయకుడు మాత్రమే కాదు, తెలంగాణకు అతీతంగా దూరదృష్టి కలిగిన జాతీయ స్థాయి రాజకీయ శక్తిగా ఎదిగే సామర్థ్యమున్న రాజనీతిజ్ఞుడు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని ప్రత్యక్షంగా అనుభవించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపించిన తీరును ప్రజలు మళ్లీ గుర్తు చేసుకోవాలి. తెలంగాణకు అవసరమైన నాయకత్వాన్ని తిరిగి సంపాదించుకోవాలి. జరిగిన తప్పును సరిదిద్దుకోవడం తప్పనిసరి. కేసీఆర్ రాక చరిత్రలో లిఖించినదే. మార్గదర్శి తిరిగి రావాల్సిందే!

---

## పంచాయతీలు అస్తవ్యస్తం

గ్రామ పంచాయతీల పాలన బాధ్యతను ప్రత్యేకాధికారులకు అప్పగించి ఏడాది పూర్తయింది. అందుకే గ్రామ పంచాయతీలు అస్తవ్యస్తమయ్యాయి. ఏ గ్రామంలో చూసినా పారిశుద్ధ్య లోపం కనిపిస్తున్నది. మురుగు, చెత్తా చెదారం పేరుకుపోతున్నది. ఈ ప్రత్యేకాధికారులు తమకున్న రెగ్యులర్ బాధ్యతలతో పాటు ఈ ప్రత్యేక బాధ్యతలు నిర్వహించలేకపోతున్నారు. గ్రామాల్లో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన నర్సరీలకు కనీసం నీళ్లందించే పరిస్థితులు లేవు. కేసీఆర్ తీసుకువచ్చిన స్వచ్ఛత చర్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు. వీధుల్లో దోమలు ప్రబలుతున్నాయి. పదేండ్లలో ఉళ్లల్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయటం ఊరు బయట చెత్త నిర్వహణను చేపట్టడం వంటివి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది. దీంతో గ్రామాలు పచ్చదనంతో, స్వచ్ఛంగా మారాయి. ట్రాక్టర్ల నిర్వహణ మూలకుపడింది. గ్రామ పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసిన వెంటనే ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ రెండు, మూడు గ్రామాలకు కలిపి ఒకే అధికారిని నియమించటం వల్ల చాలాచోట్ల అధికారులు సంతకాలు చేసి చేతులు దులుపుకొంటున్నారు. వాళ్ల మాతృశాఖ బాధ్యతలకే పరిమితమై కనీసం గ్రామ పంచాయతీలను సందర్శించడం లేదు. ట్రాక్టర్లకు చెల్లించాల్సిన రుణాలు సకాలంలో చెల్లించడం లేదు. పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల నిర్వహణను గాలికి వదిలేశారు. చెత్త డబ్బాలు, బ్రీ గార్డులకు నిధులేక వాటి నిర్వహణ అధ్వానంగా మారింది. పంచాయతీ చెత్త వాహనాలకు డీజిల్‌కు కూడా డబ్బులు చెల్లించలేకపోవటంతో అవి పంచాయతీ కార్యాలయాలకే పరిమితమయ్యాయి. అసలు పంచాయతీ ఖాతాల్లో ఒక్క పైసా లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా గ్రామ పంచాయతీలకు కేటాయించకపోవడం శోచనీయం.

129 మున్సిపల్ కౌన్సిల్స్, 9 కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు గత జనవరి 26తో ముగిసింది. గ్రామాల్లో ఉన్న పరిస్థితి కంటే అధ్వానంగా పుర పాలక సంఘాలున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సమస్య పట్టి పీడిస్తున్నది. ఇలా ప్రత్యేకాధికారుల పాలన వల్ల నిధుల కేటాయింపుల్లోనూ స్థానిక సంస్థలకు అన్యాయం జరుగుతున్నది. కేంద్ర ఆర్థికసంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికైన పంచాయతీలకే నిధులు విడుదల చేస్తున్నది. 15వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి రూ.7,201 కోట్లు కేటాయించింది. ఇందులో 2022లో రూ.1,365 కోట్లు, 2023లో 1,415 కోట్లు కేటాయించింది. 2023-24 ఏడాదికి రూ.1,430 కోట్లు కేటాయించినప్పటికీ రూ.715 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఈయేడు మొదటి విడత నిధులు ఇంకా విడుదల కాలేదు. ఈ నిధులు విడుదలవ్వాలంటే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగి పాలక వర్గాలు కొలువుదీరాలి. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య నేతృత్వంలో రాష్ట్ర ఆర్థికసంఘాన్ని ఏర్పాటుచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సంఘం నివేదికను ఇప్పటివరకూ ప్రజల్లోకి తీసుకురాకపోవటంతో నిధుల కేటాయింపు జరగలేదు. మొదట అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తామన్న రేవంత్ మొదటి ఆరు నెలలు వాటి ఊసే ఎత్తలేదు. ఆ తర్వాత కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు పెంచి నిర్వహిస్తామని చెప్పి ఆ తర్వాత మాట మార్చారు. కేంద్రం ఆమోదిస్తేనే బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యమని తెలిసి కూడా కావాలనే తాత్సారం చేస్తున్నారు. ఇప్పుడు కులగణన నివేదిక బయటకు వచ్చాక మరో ఆరు నెలల వరకు ఎన్నికలు నిర్వహించే సూచనలు కనిపించడం లేదు. ప్రత్యేకాధికారుల పాలన ఆరు నెలలకు మించకూడదు. కానీ, ఈ ప్రభుత్వం ఏడాదిన్నర గడుస్తున్నా ప్రజా ప్రాతినిధ్యాన్ని నిరాకరిస్తున్నది. మార్చి, ఏప్రిల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ సహా ఇతర ప్రవేశ పరీక్షల్లో అధికార యంత్రాంగం తలమునకలయ్యే అవకాశమున్నది. అంటే మరో 4 నెలల వరకు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఇలాగే ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కొనసాగితే వాటి పాలన పడకేస్తుంది. కార్మికుల జీతాలు, పైపుల లీకేజీల మరమ్మతులు, నెల నెలా విద్యుత్తు బకాయిలు చెల్లించే పరిస్థితి లేదు. రాష్ట్రంలోని సుమారు 12,600 గ్రామ పంచాయతీల్లో సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు సహా గెజిటెడ్ అధికారులకు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పగించారు. వీరికి అసలు పంచాయతీరాజ్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో తెలియదు. అటు తమ బాధ్యతలు నిర్వహించాలా, లేక గ్రామాల్లో బాధ్యతలు చేపట్టాలా వారికి అర్థం కావడం లేదు.

కాబట్టి, ప్రభుత్వం ఇప్పటికైనా పంచాయతీ ఎన్నికలను వెంటనే నిర్వహించాలి. గ్రామాల శుభ్రతకు సరిపడా నిధులు కేటాయించాలి. ఎన్నికలు నిర్వహిస్తేనే కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, నిధులు విడుదలవుతాయి. ఆలస్యం చేసిన కొద్దీ ఆ నిధులు మురిగిపోతాయి.

**- మఠం భిక్షపతి,** 95424 23242

---

**గత రెండు దశాబ్దాలుగా మధ్యతరగతి ప్రజల మనస్తత్వాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. మరింత మెరుగైన జీవితాన్ని ఆశిస్తున్న తల్లిదండ్రులు తాము కష్టపడుతూ పిల్లలను ఐటీ ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని కలలుగన్నారు. తమ పిల్లాడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని చెప్పుకోవాలని ఉవ్విళ్లూరారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వారి ఆశలను చిదిమేస్తున్నది. భవిష్యత్తులో ఐటీ ఉద్యోగాలను కృత్రిమ మేధ అమాంతం మింగేస్తుందన్న భయాలు నెలకొన్నాయి.**

# చెదిరిపోతున్న ఐటీ కల

ఎడిటోరియల్ డెస్క్

ఇన్ఫోసిస్ మైసూర్ క్యాంపస్ ఇటీవల 400 మంది ట్రైనీ ఉద్యోగులను తొలగించడం ఏఐ ఇస్తున్న హెచ్చరికగానే భావించాలి. నిజానికి భారత్‌లో అత్యధిక వేతనాలు చెల్లిస్తున్నది ఐటీ రంగమే. అయితే, కృత్రిమ మేధ రాకతో ఇప్పుడు దీనిని గత చరిత్రగానే చెప్పుకోవాలి. నెలకు రూ.20 వేల నుంచి రూ. 25 వేలు అందుకున్న ఇద్దరు ఫ్రెషర్ల స్థానంలో రూ. 17 వేలు మాత్రమే చెల్లించి ఏఐతో వారి సేవలను భర్తీ చేసుకునే వెసులుబాటు ఇప్పుడు ఐటీ కంపెనీలకు లభించింది. అదే నెలకు రూ. 17,500 ఖర్చు చేస్తే పీహెచ్‌డీ స్థాయి ఏఐ ఏజెంట్‌ను యాక్సెస్ చేసుకొని నెలకు రూ. 70 వేల నుంచి రూ. లక్ష వేతనం చెల్లిస్తున్న ఉద్యోగులను భర్తీ చేసుకోవచ్చు. బడా ఐటీ కంపెనీలకు ఈ విషయం రెండేండ్ల క్రితమే తెలుసు. 2022 ఏడాది చివరలో వచ్చిన 'చాట్‌జీపీటీ' ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో పెను ప్రకంపనలే సృష్టించింది. టెక్ కంపెనీలకు ఇది ఒక రకంగా వరం కాగా, మరో రకంగా ముప్పు కూడా పొంచి ఉన్నది.

మరీ ముఖ్యంగా భారత్‌లోని ఐటీ కంపెనీలకు ఏఐ భయం పట్టుకుంది. ఇక్కడి సంస్థల్లో చాలావరకు విదేశీ కంపెనీలకు పనిచేస్తాయి. వారికి కావాల్సిన విధంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి అందిస్తాయి. వారి డాటాను డిజిటలైజ్ చేస్తాయి. అయితే, ఇప్పుడు విదేశీ కంపెనీలు భారత్‌కు ఔట్ సోర్సింగ్ ఇవ్వడానికి బదులు చాట్‌జీపీటీకే ఆ పని అప్పగించే అవకాశం ఉన్నది. 'స్టెబిలిటీ ఏఐ' రూపకర్త ఇమాద్ మొస్టాక్ 2023 జూలైలోనే ఈ పరిణామాన్ని అంచనా వేశారు. ఏఐ వల్ల తొలుత ఉద్యోగాలు కోల్పోయేది భారత్‌లోని ఐటీ కోడర్లేనని హెచ్చరించారు. భారత్‌లోని కోడ్ రైటర్ల కంటే ఏఐ మరింత మెరుగ్గా పనిచేస్తుందని, భారతీయ కంపెనీలు ఇందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

గత రెండేండ్లుగా చూసుకుంటే ఐటీ ఉద్యోగాల సంఖ్య క్రమంగా పడిపోతున్నది. దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో వంటివి 2023-24 నుంచి ఉద్యోగుల సంఖ్యను కుదిస్తున్నాయి. వేతన పెంపుదలను కూడా ఆలస్యం చేస్తున్నాయి. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) గణాంకాల ప్రకారం.. క్లరికల్ స్టాఫ్, టెక్నీషియన్లు కాకుండా ఇండియాలో దాదాపు రెండు కోట్ల మంది వైట్‌కాలర్ ఉద్యోగాలు చేస్తున్నారు. మేజర్ ఐటీ కంపెనీల్లో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా టాప్-5లో కొనసాగుతున్నాయి.

**ఐటీ ఉద్యోగాలు సాధిస్తే తమ బతుకులు గాడిన పడతాయన్న ఆశతో దేశంలోని మధ్యతరగతి ప్రజలు తమ పిల్లలను కంప్యూటర్ సైన్స్ డిగ్రీ వైపు బలవంతంగా పంపుతున్నారు. ఇందుకోసం సంపాదించుకున్న మొత్తాన్ని ఐటీ చదువులకు వెచ్చిస్తున్నారు. దేశంలో ప్రస్తుతం13 లక్షల మంది విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ కోర్సులు చేస్తున్నారు. నిజానికి ఐటీ జాబ్ సౌకర్యవంతమైన జీవితానికి గ్యారెంటీ మాత్రమే కాదు.. విదేశాల్లో, మరీ ముఖ్యంగా అమెరికా వంటి దేశాల్లో ఉద్యోగానికి అది తలుపులు తెరుస్తుంది.**

విదేశీ కంపెనీలు భారత్‌లోని టెక్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడం వెనుక బలమైన కారణమే ఉంది. ఎందుకంటే భారత్‌లోని టెక్ కంపెనీలు చాలా తక్కువ ధరకే ప్రాజెక్టులు చేసి పెడతాయి. దీనినిబట్టి అర్థం చేసుకోవాల్సింది ఒకటి ఉంది. రానున్న రోజుల్లో ఐటీ రంగంలో ఉద్యోగాలు పెరిగినా వేతనం మాత్రం తగ్గుతుంది. ప్రస్తుతం పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్లకు మధ్యస్థంగా నెలకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేల వరకు ఆఫర్ చేస్తున్నాయి. పదేండ్ల క్రితంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. 2015లో వాస్తవ కొనుగోలు శక్తి రూ. 25 వేలు ఉంటే ప్రస్తుతం అది రూ. 40 వేలుగా ఉన్నది. అప్పట్లో వేతన పెంపు కూడా ఎక్కువగా ఉండటంతోపాటు క్రమం తప్పకుండా ఉండేది. ఇప్పుడా స్థాయికి చేరుకోవాలంటే చాలా కాలం పడుతుంది.

ఇక, తాజా పరిణామాలు మధ్యతరగతికి ఒక గుణపాఠంగానే భావించాలి. పిల్లలకు ఇష్టం లేకున్నా కంప్యూటర్ సైన్స్ వైపే వెళ్లాలంటూ వారిపై ఒత్తిడి తీసుకురావడం మానుకోవాలి. గత రెండు దశాబ్దాలుగా ఐటీ ఉద్యోగాలు స్థిరంగా పెరుగుతున్నప్పటికీ, సూపర్ టాలెంట్ ఉంటే తప్ప ఇప్పుడు మనుగడ సాగించలేని పరిస్థితులున్నాయి. అయితే, ఇది ఒక్క ఇండియాకే పరిమితమైన సమస్య కాదు. ప్రతి చోటా ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. అమెరికాలో కొవిడ్‌కు ముందున్న కాలంతో పోలిస్తే సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ ఉద్యోగాలు 35 శాతం పడిపోయాయి. ముఖ్యంగా చాట్ జీపీటీ వచ్చాక ఉద్యోగాల్లో క్షీణత మొదలైంది. మరో చేదు నిజం ఏంటంటే.. ఏఐ ప్రభావం ఒక్క టెక్ రంగానికే పరిమితం కాదు, ప్రతి రంగంలోనూ ఇది ఉద్యోగాలను భర్తీ చేయగలదు.

'బ్లూమ్‌బర్గ్' సర్వే ప్రకారం వచ్చే కొన్ని సంవత్సరాల్లో వాల్‌స్ట్రీట్‌లో ఏకంగా 2 లక్షల ఉద్యోగాలు మాయమయ్యే అవకాశం ఉన్నది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో సగానికి పైగా ఉద్యోగాలను ఏఐ మింగేస్తుందని సర్వే అంచనా వేసింది. భారత్‌లోని మధ్యతరగతికి ఇది మరో ఎదురుదెబ్బనే చెప్పాలి. ఎందుకంటే వైట్‌కాలర్ ఉద్యోగాల్లో ఎక్కువ శాతం ఆర్థిక రంగంలోనే ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారి ఒక తరం.. వారి తల్లిదండ్రుల కంటే తక్కువ సంపాదించే ప్రమాదంలో పడింది. ఉద్యోగాలు రాని యువతీయువకులు వారి తల్లిదండ్రులపైనే ఆధారపడతారు. వివాహాలు ఆలస్యమవుతాయి. ఇది వారిని మానసికంగా కుంగదీస్తుంది. నిరాశ పెరుగుతుంది. చిన్నచిన్న విషయాలకే గొడవలు పడటం సర్వసాధారణం అయిపోతుంది.

**'బ్లూమ్‌బర్గ్' సర్వే ప్రకారం వచ్చే కొన్ని సంవత్సరాల్లో వాల్‌స్ట్రీట్‌లో ఏకంగా 2 లక్షల ఉద్యోగాలు మాయమయ్యే అవకాశం ఉన్నది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో సగానికి పైగా ఉద్యోగాలను ఏఐ మింగేస్తుందని సర్వే అంచనా వేసింది. భారత్‌లోని మధ్యతరగతికి ఇది మరో ఎదురుదెబ్బనే చెప్పాలి. ఎందుకంటే వైట్‌కాలర్ ఉద్యోగాల్లో ఎక్కువ శాతం ఆర్థిక రంగంలోనే ఉన్నాయి.**

భారతదేశంలో నాలుగు దశాబ్దాలుగా మధ్యతరగతి ప్రజలు ఐటీ కలల చుట్టూనే తిరుగుతున్నారు. కాబట్టి తర్వాతి తరమైనా ఆనందంగా జీవించాల్సిన అవసరం ఉన్నది. స్నేహితులతో గడపడం, పార్కులో ఓ సాయంత్రం అలా వాకింగ్ చేయడం, పుస్తకం చదవడం, ఆడిపాడటం ద్వారా ఆనందాన్ని వెతుక్కోవాలి. సూర్యుడు ఉదయించడానికి ముందు వచ్చే చీకటి కాలానికి మధ్యతరగతి ప్రజలు సిద్ధంగా ఉండాలి.

---

## 10 వేల కోట్లిచ్చినా 'ఎన్ఈపీ' అమలు చేయబోం

కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ను అమలు చేస్తే రాష్ట్రానికి రూ. 2 వేల కోట్లు ఇస్తామని కేంద్రం చెప్తున్నది. కానీ, రూ. 10 వేల కోట్లు ఇచ్చినా దానిని అమలు చేసే ప్రసక్తే లేదు. మేం ఏ భాషకూ వ్యతిరేకం కాదు. కానీ, ఎన్ఈపీని బలవంతంగా రుద్దే ప్రయత్నాన్నే వ్యతిరేకిస్తున్నాం. జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించడానికి హిందీ ఒక్కటే కారణం కాదు.. మరెన్నో ఉన్నాయి. 'ఎన్ఈపీ'ని అంగీకరించి తమిళనాడును 2 వేల సంవత్సరాల వెనక్కి నెట్టే పాపాన్ని మూటగట్టుకోలేను.

**-స్టాలిన్,** తమిళనాడు ముఖ్యమంత్రి

---

## మళ్లీ కరెంట్ కష్టాలు

రాష్ట్రంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు వేడెక్కినకొద్దీ విద్యుత్తు డిమాండ్ గణనీయ స్థాయిలో పెరిగింది. కానీ, డిమాండ్‌కు తగ్గట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్తును అందజేయలేకపోతున్నది. ముఖ్యంగా హైదరాబాద్ మహా నగరంలో విద్యుత్తు కోతలు అధికమయ్యాయి. అధికారిక, అనధికారిక కోతలతో నగరవాసులు, పరిశ్రమలు ఇబ్బందులు పడుతున్నాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో జనరేటర్లు, ఇన్వర్టర్ల వాడకం ఎక్కువగా ఉండేది. కానీ, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కనీసం ఒక్క క్షణం కూడా విద్యుత్తు కోత లేకుండా కేసీఆర్ ప్రభుత్వం చూసుకున్నది. కానీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని పూర్తిగా అంధకారంలోకి తీసుకెళ్లే అవకాశం కనిపిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్తును డిమాండ్‌కు తగ్గట్టుగా అందించిన ప్రభుత్వ కృషి వల్లే హైదరాబాద్‌లో పరిశ్రమలు వర్ధిల్లాయి. గతేడాది వేసవి ఎలాగోలా గట్టెక్కినప్పటికీ ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే కోతలు మొదలయ్యాయి. జనవరిలో 15 వేల మెగావాట్ల పీక్ అవర్ డిమాండ్ నమోదైంది. సరైన ప్రణాళిక లేకుండా వెళ్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వల్ల వేసవిలో తెలంగాణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నది. గతేడాది ఇలాగే అనధికారిక కోతలు విధించిన ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జర్నలిస్టులు, సామాన్యులపై పోలీసు కేసులు పెట్టించిందీ ప్రభుత్వం. తమ ప్రభుత్వంలోని లోపాలను సరిదిద్దుకోవటానికి బదులుగా కేసులు పెట్టడం ఎంతవరకు ప్రజాస్వామికం.

గత పదేండ్లుగా సుపరిపాలన, వ్యాపార కార్యకలాపాలకు అనుమతుల వల్ల విద్యుత్తు డిమాండ్ ఏటా 5 నుంచి 6 శాతం పెరుగుతున్నది. కానీ, ఈ ఏడాది ఒక్క జనవరిలోనే 10 శాతం డిమాండ్ పెరిగింది. ఈ పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేయకుండా గతంలో ప్రభుత్వం విద్యుత్తు ఉద్యోగులను బద్నాం చేసింది. కారణం లేకుండా కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏకంగా ముఖ్యమంత్రే ఉద్యోగులను హెచ్చరించారు. వీటిపై అప్పట్లోనే విద్యుత్తు జేఏసీ మండిపడింది. ముఖ్యమంత్రి అకారణంగా ఉద్యోగులపై తప్పు నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించింది.

ప్రస్తుతం హైదరాబాద్‌లో రెండు నుంచి మూడు గంటలు కోతలు విధిస్తున్నారు. గృహ వినియోగదారులకే కాకుండా పరిశ్రమలకు ఈ కోతలు విధిస్తున్నారు. అధికారికంగా వెల్లడించకుండా కోతలు విధించటం వల్ల తీవ్ర అసౌకర్యం కలుగుతున్నది. చిన్న చిన్న వ్యాపారుల నుంచి మొదలు పెడితే విద్యుత్తుపై ఆధారపడి వ్యాపారం చేసే వా